
# సాహితీ వైద్యం

## డా॥ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం



సాహితికి మేనేజర్ని నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది.

సాయంత్రం అయిదు గంటలప్పుడు బల్లమీది కాగితాలన్నీ సర్దేసి, హేండ్ బ్యాగు భుజాన తగిలించుకుంటుండగా మేనేజరుగారు పిలుస్తున్నా రంటూ వచ్చాడు అటెండర్ వాసు.

నీరసంగా అడుగులు వేస్తూ ఆయన గది దగ్గరకు వెళ్ళి స్ప్రింగ్ డోర్ తెరచుకుని లోపలికి అడుగు పెట్టింది సాహితి.

"మీ కోసం ఇప్పుడే చేసిన వేడి సమోసా, కాఫీ తెప్పించాను. ముందు టిఫిన్ తినేసి ఒక అరగంట కూర్చుని ఈ పని పూర్తిచేసి వెళ్ళాలి" అన్నాడు. మోహనకృష్ణ కొన్ని కాగితాలు ముందుకు జరుపుతూ.

'చక్కనమ్మ చిక్కినా అందమే' అన్నట్టు ఉదయం నుండి పని చేసి అలసి పోయి వున్నా అందంగా వుంది సాహితి. చుడీదార్లో మరింత ఆకర్షణీయంగా కనబడుతోంది. కొత్తగా ఉద్యోగంలో చేరింది గనుక తనకి ఎదురు చెప్పదన్న ధీమా వుంది మోహనకృష్ణకి.

ఏదో ఒక కారణంతో ఆఫీసు పని సమయం అయిపోయాక ఆమెను ఇంటికి పోనీయకుండా ఆపేస్తున్నాడు అతను. అందరూ వెళ్ళిపోయాక అటెండరు బయట కూర్చుంటాడు. ముసలి సూపరింటెండెంటు మాత్రం ఏదో బ్రహ్మరాత రాస్తుంటాడు. పక్కనే టపాకాయ పేల్చినా అతనికి వినబడదు.

సాహితిని తన గదిలోకి పిలిచి పని ఒప్పగించి, ఆ పని పూర్తి చేయనివ్వ కుండా ఆమెతో కబుర్లు చెబుతాడు మానేజరు. అవీ చెత్తకబుర్లు.

"ఈ డ్రెస్ మీకు మరీ బిగుతైనట్టుంది. అదో అందమనుకోండి. సన్నగా రివటలా వుండే వాళ్ళ కన్నా కండపట్టి నేవళంగా వుండే ఆడవాళ్ళలోనే స్త్రీత్వం అందంగా కనబడుతుంది" వంటి వెకిలి మాటలు విసురుతాడు. అతని ఆట కట్టించడమెలాగో సాహితికి తోచడం లేదు.

"ఏమిటాలోచిస్తున్నారు? టిఫిన్ చల్లారిపోతుంది. మీతోబాటు తిందామని నేను కాచుకుని కూర్చున్నాను. రండి" అన్నాడు ఆమె నడుము వంపు మీద దృష్టి నిలిపి. ఆ రోజు చీరెలో వుంది సాహితి.

"నాకు సమోసా అంటే అలర్జీ. ఇందాకే కాఫీ తాగాను" అనేసి పేపర్లు తీసుకుని తన బల్ల దగ్గరికి వచ్చి కూర్చుంది.

కాసేపయ్యాక తను కూడా బయటకువచ్చి ఆమె ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు మేనేజరు.

"నేను రెండ్రోజులు సెలవుపెట్టి ఊరు వెడుతున్నా. పెళ్ళాన్ని చూడకుండా నెల దాటిందంటే బండి మొండికేస్తుంది. ఇంకా వయసులో వున్నాను కదా... ఈ రకం బాధ నీకు ఇంకా అనుభవంలోకి రాలేదేమో..."

విలాసంగా నవ్వుతూ ఒక గొప్పవిషయం గురించి చెప్తున్నట్టుగా చెప్పాడు మోహనకృష్ణ.

సాహితి ముఖం ఎరుపెక్కింది. మనసులోనే 'ఛీ' అనుకుంది. నలభై అయిదేళ్ళు దాటుతున్న మనిషి. ఇద్దరు ఆడపిల్లల తండ్రి, మరొక పెళ్ళి కాని ఆడపిల్లతో మాట్లాడే తీరు ఇదేనా? అని దులిపేయాలనిపించిం దామెకు.

ఒక కూతురు జూనియర్ ఇంటరు చదువుతున్నదనీ, మరొక పిల్ల టెన్త్‌లో వుందనీ సహోద్యోగుల ద్వారా విన్నది. వాళ్ళ చదువుకోసం అక్కడే వుంచేసాడట భార్యని. నెలకోసారి వెళ్ళివస్తాడు కుటుంబంతో గడప డానికి.

"అప్పుడప్పుడు బ్యాటరీ రీఛార్జ్ చేసుకోకపోతే నాకు పని మీద దృష్టి నిలవదు. ఆ మాటకొస్తే ఏ మగాడికైనా అంతే అనుకో..." అతని మాటలు విననట్టు పనిలో మునిగిపోయిన సాహితిని కావాలని కవ్విస్తున్నట్టు మళ్ళీ చెప్పాడతను.

ఆమె కాగితాలు ఫైల్‌లో పెట్టి లేచి నిలబడింది. "రేపు కావాలంటే గంట ముందుగా వెళ్ళిపో... నేను చెబుతాలే సూరింటెంటెండ్ గారికి" అన్నాడు వుదారంగా.

"అవసరం లేదండీ. నాకేమీ పనిలేదు. ఇక నేను వెళ్తాను" అంటూ అడుగు ముందుకు వేసింది. అతను కూడా లేచి నిలబడ్డాడు.

"మా ఆవిడకో గద్వాల చీరె కొనుక్కు వెడదామనుకున్నాను గానీ కుదరలేదు. నీలాగా ఎక్కడ ఎంత చూపించాలో తెలిసి అందంగా కట్టడం రాదనుకో దానికి. పిల్లలు పుట్టాక పొట్ట పెరిగింది..." పల్చగా లోపలికి వున్న సాహితి పొత్తి కడుపు వైపు చూస్తూ అన్నాడు.

గబుక్కున చీరెకొంగు క్రిందకు లాక్కుంది సాహితి. "లంచం ఇస్తే పెళ్ళాం మైనా దారికొచ్చి మరింత సుఖమిస్తుంది" కులాసాగా నవ్వుతూ అనేసి తన గదివైపు నడిచాడు మోహనకృష్ణ.

సాహితి బ్యాగులో నుండి రుమాలు తీసి ముఖం తుడుచుకోవడం క్రిందకి జారిన కళ్ళద్దాలపై నుండి చూసిన సూపరింటెండెంట్‌కి బాస్ మాటలు వినబడకపోయినా ఏదో చెత్తవాగుడు వాగాడని ఊహించి చిన్నగా నిట్టూర్చాడు.



మర్నాడు శుక్రవారం ఉదయాన్నే తల స్నానం చేసి దగ్గరలో వున్న రాజరాజేశ్వరి గుడికి వెళ్ళింది సాహితి. ఆమె మన సంతా గందరగోళంగా వుంది. డిగ్రీ పూర్తికాగానే స్టాఫ్‌సెలెక్షను పరీక్ష రాయడం, ఉద్యోగం రావడమే కాక వున్న ఊళ్ళోనే పోస్టింగు ఇవ్వడంతో తనెంతో అదృష్టవంతురాలినని పొంగి పోయింది.

ఆఫీసుల్లో లైంగికవేధింపులు వుంటాయని విన్నదిగానీ అది తానే ఎదుర్కోవలసి వస్తుందని ఊహించలేదు సాహితి. రానురాను వల్గర్‌గా వుంటున్న మోహనకృష్ణ మాటలు, చేష్టలు ఆమె ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఆవిరి చేసేసాయి. తండ్రితో గానీ, అన్నతో గానీ చెబుదామంటే పరిణామం ఎలా వుంటుందోనన్న భయం. ఈ సమస్యకు పరిష్కారం తానే కనుక్కోవాలి అనుకుంటూ మనసు కుదుటబడితే ప్రశాంతత చేకూరుతుందని గుడికి వచ్చింది.

అమ్మవారికిచ్చిన హారతి కళ్ళ కద్దుకొంటున్నప్పుడు తన

పక్కన నిలబడిన ఇల్లాలు కట్టుకున్న గద్వాల చీరెమీద పడింది సాహితి దృష్టి. ఆకుపచ్చని చీరెకు ముదురు గులాబీరంగు బార్డరు మీద జరీతో అల్లిన హంసలతో, నిండైన కొంగుతో ఎంతో అందంగా వున్నదాచీరె.

గర్భగుడిలో నుండి బయటకు వచ్చిన సాహితి ఇందాక తను చూసిన చీరె కట్టుకొన్న ఇల్లాలి పక్కన కూర్చుంది. "మీ చీర చాలా బావుందండీ. ఎక్కడ కొన్నారు?'' అని ఆరా తీసింది.

"నాగప్ప షాపులో కొన్నానమ్మా. ఒక్క చీరెకోసం ఎంత దగ్గరైనా గద్వాలకు వెళ్ళి కొనలేం కదా!'' అన్నదామె నవ్వుతూ.

కర్నూలుకు వచ్చిన వాళ్ళు పక్కనేవున్న గద్వాలకు వెళ్ళి చీరెలు కొంటారని అమ్మ పిన్నితో చెప్పడం గుర్తుంది సాహితికి. 'కర్నూల్లోనే దొరకుతాయన్నమాట' అనుకుంది. గుడికి వెళ్ళివచ్చాక మనసంతా తేలికగా అనిపించింది సాహితికి.

***

ఆదివారం నాడు ఆలస్యంగా నిద్రలేచి నలిగిపోయిన లుంగీతో హాల్లోకి వచ్చిన మోహనకృష్ణకు సోఫాలో కూర్చుని తన భార్య రేవతితో మాట్లాడుతున్న సాహితిని చూడగానే చలికాలమైనా చెమటలు పట్టాయి.

అతన్ని చూడగానే వినయంగా లేచి నిలబడి ఒద్దికగా నమస్కరించింది సాహితి.

"ఈ అమ్మాయి మీ ఆఫీసులోనే పని చేస్తోందట కదండీ? మీరు నా కోసం గద్వాల చీరె కొనాలనుకుని టైములేక వచ్చేసారట గదా! పాపం తను కొని తీసుకొచ్చింది. ఎంత బావుందో చూడండి.'' ఆకుపచ్చని చీరెకు ముదురు గులాబీరంగు బార్డరు మీద హంసలు కూర్చిన చీరె భర్తకు చూపిస్తూ మురిపెంగా అంది రేవతి.

మోహనకృష్ణకు గొంతులో నుండి మాట బయటకు రాలేదు ఒక నిముషం దాకా.

"సాహితీ! నువ్వు ఈ ఊళ్ళో... ఇక్కడికెందుకు వచ్చావు? ఎవరున్నారు?'' అనడిగాడు తడబాటు అణచుకుంటూ.

"అవేం ప్రశ్నలండీ? పాపం ఆ అమ్మాయి శ్రమపడి చీరెకొని ఇంటికి తీసుకువచ్చి ఇస్తే ఎందుకొచ్చావు? అనడుగుతారేమిటి? ఏం మనింటికీ రాకూడదా? ఏమ్మా మీ బాస్ నన్నో రాక్షసిగా చిత్రించలేదు కదా కొంప దీసి?'' అనడిగింది రేవతి మొగుడిని కోప్పడ్డాక.

నిజానికి రేవతిని చూడగానే సాహితికి చాలా ఆశ్చర్యమనిపించింది. పదహారేళ్ళ పిల్ల తల్లిలా లేదామె. మరీ పొడుగ్గా బంగారు తీగెలా లేక పోయినా అయిదడుగుల రెండంగుళాల పొడవుతో అందుకు తగిన శరీర సౌష్టవంతో చామనఛాయతో అందంగా వున్నదామె. చెవులకు ముత్యాల కమ్మలు, ఒంటిరాయి రవ్వల ముక్కుపడక, ఒత్తైన బారెడుజడతో సంసార పక్షంగా ఇల్లాలితనం ఒలకపోస్తూ వున్న రేవతి సాహితికి చాలా నచ్చింది. 'ఇంత చక్కని రంభ ఇంటిలో వుండగా ఇతడికి ఈ చపలబుద్ధి ఏమిటో' అనుకుంది.

రేవతి అడిగిన ప్రశ్నకు చిరునవ్వు నవ్వుతూ మోహనకృష్ణవైపు చూసింది సాహితి. "నిజం చెప్పేయమంటారా సర్?'' అనడిగింది పెంకెగా.


"నేను ముఖం కడుక్కువస్తాను..'' అంటూ గబగబ లోపలికి వెళ్ళి పోయాడు మోహనకృష్ణ. అతని గుండె రాజధాని ఎక్స్‌ప్రెస్‌లా పరిగెడు తోంది. 'ఏం చెబుతుంది? నిజంగానే తను వాగిందంతా రేవతికి చెప్తే?' అనుకుంటుంటే కాళ్ళక్రింద భూమి కదలిపోతున్నట్టనిపిస్తోందతనికి.

"అయ్యో! మా బాస్ మీ గురించి కలవరిస్తుంటారండీ! నెలకొకసారైనా చూడకపోతే బెంగపడిపోతారు. చీరె అందంగా కట్టుకోవడం మీకు తెలిసి నట్టు మరొకరికి తెలియదట.'' సాహితి నవ్వుతూ చెప్పడం అతని చెవిలో పడింది.

అతని మనసు కుదుటపడింది. ముఖం కడుక్కొని బట్టలు మార్చుకొని వచ్చి భార్య పక్కన కూర్చున్నాడు.

"ఇక్కడ 'ఆకాశవాణి' ఆఫీసులో మా చిన్నాన్న పని చేస్తున్నారు. నేను కథలు, కవితలు రాస్తుంటాను. అంచేత 'మహిళా ప్రభ' ప్రోగ్రాంకి ఒక ప్రసంగ పాఠం రికార్డ్ చేయడానికి వచ్చాను. ఎలాగూ వస్తున్నాను కదా అని మీ శ్రీమతిగారి కోసం మీరు కొనాలనుకున్న గద్వాలు చీరె తీసుకు వచ్చాను'' అంది సాహితి అతను అంతకుముందు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా.

"మీరు రచయిత్రి అని నాకు తెలియదు. కొంపదీసి స్త్రీ వాదులా? అలా అయితే మా మగవాళ్ళను ఏకిపారేస్తారా ఏం?'' మనసులో రేగిన అనుమానాన్ని వ్యక్తం చేసాడు మోహనకృష్ణ. అతని ముఖం వివర్ణమైంది.




"ఎన్ని వాదాలొచ్చినా ఆడవాళ్ళకు అగచాట్లు తప్పడం లేదు కదండీ! ఉద్యోగం చేస్తున్నది అంటే మగవారితో రాసుకుని పూసుకుని తిరగడానికి అభ్యంతరం లేనిది అని అర్థం తీస్తారు. ఇక పెళ్ళికాని ఉద్యోగిని అయితే పిలవగానే ఒళ్ళో వాలడానికి సిద్ధంగా వున్నట్టే అనుకుంటారు పురుష పుంగవులు. మీ వంటి వారి విషయం వేరనుకోండి...'' నిట్టూరుస్తూ మోహనకృష్ణ వైపు సూటిగా చూసింది సాహితి.

"థాంక్స్... ఆ మాట అన్నందుకు... మా రేవతి కోపతాపాల నుండి కాపాడారు..'' బలవంతంగా నవ్వుతూ అన్నాడు మోహనకృష్ణ.

అప్పుడే హాల్లోకి వచ్చిన కూతుళ్ళను చూసి "మా లలితకు, మాలినికి కథలు చదవడం ఇష్టం'' అని సాహితికి చెప్పి, "ఈమె కథలు, కవితలు రాస్తారుట. మీ నాన్న పనిచేసే ఆఫీసులోనే పని చేస్తున్నారు'' అని చెప్పింది కూతుళ్ళతో రేవతి.

"వావ్... ఏ పత్రికలో వస్తాయి ఆంటీ మీ కథలు? మా కివ్వరూ చదివి ఇస్తాము.'' అంటూ సాహితిపక్కన చేరారు లలిత, మాలిని "ఏ విషయాలు గురించి రాస్తారు?'' అంటూ ప్రశ్నలు సంధించారు.

"జీవితంలో నుండే కథలు వస్తాయమ్మా! అంతే కద సర్?'' అన్నది సాహితి మోహనకృష్ణ వైపు చూసి.

"అవునవును. అంతే'' అని "సారీ సాహితీ! నీకు శ్రమ ఇచ్చాను. ఏమీ అనుకోకు'' అన్నాడతను. అతను దేని గురించి మాట్లాడుతున్నాడో సాహితికి అర్థమయింది. ఆమె హృదయం తేలిక పడింది.

"కర్నూల్లో మంచిస్కూల్స్, కాలేజీలు వున్నాయండీ! వీళ్ళ పరీక్షలు అయిపోగానే మీరు అందరూ అక్కడికే వచ్చేయండి. అప్పుడు మా 'బాస్' గారికి మీ గురించి బెంగ పెట్టుకునే పని వుండదు. అంతే కదు సర్?'' అంటూ రేవతికి చెప్పి మోహనకృష్ణ నడిగింది.

ఆమె పలికే ఒక్కొక్కమాట తన వెకిలితనాన్ని వేలెత్తి చూపుతూ దోషిగా నిలబెడుతుండగా పశ్చాత్తాపంతో కృంగిపోతున్న మోహనకృష్ణ ప్రయత్నం మీద సర్దుకుని "తప్పకుండా నా కుటుంబాన్ని అక్కడికి తీసుకొచ్చేస్తాను సాహితీ! ఇకపై నా వలన నీకు ఏ ఇబ్బందీ వుండదు'' అన్నాడు.

"అంటే నాకోసం గద్వాల చీరెలు కొని తీసుకువచ్చి ఇవ్వడం వంటి ఇబ్బందులన్న మాట...'' అని నవ్వింది రేవతి. మా వారికి నామీద ప్రేమ ఎక్కువై ఇలా ఇతరుల్ని బాధిస్తుంటారు. ఏమీ అనుకోకు అమ్మా! అని కూడా చేర్చింది మళ్ళీ.

సాహితి మోహనకృష్ణ వైపు చూసింది. అతని చూపులలో కనబడిన పశ్చాత్తాపం ఆమె మనసుకు ఊరట కలిగించింది. తన వైద్యం పనిచేసి నందుకు సాహితికి సంతోషం కలిగింది. 'శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు' మనసులో అనుకుంటూ.

"నేను వెళ్ళి వస్తానండీ... నేను మళ్ళీ కడపకు వస్తే తప్పక మిమ్మల్ని కలుస్తాను'' అని రేవతికి, ఆమె పిల్లలకు చెప్పి "వస్తాను సర్. మిమ్మల్ని సోమవారం ఆఫీసులో కలుస్తాను'' అని సెలవు తీసుకుంది సాహితి.

సాహితి వైద్యంతో మోహనకృష్ణ జబ్బు వదిలింది.

*

రచయిత్రి ఫోన్ నెం: 08518-229441